



# Voice of Jagadguru

advaitam paramanandam

an e-magazine on advaita




## Jagadguru Vani    జగద్గురు వాణి - అనుగ్రహ భాషణం

### రెండు గొప్ప శత్రువులు



మనిషికి ఇద్దరు శత్రువులు ఉన్నారు, ఒకటి 'అహంకారము' మరియొకటి 'మమకారము'. అహంకారము "నేను, నేను" అంటే, మమకారము "నాది", "నాది" అంటూ వుంటుంది. ఎప్పుడైనా ఏదైనా వస్తువును స్వీకరించినప్పుడు, “ఇది నాది” అనే భావన మమకారం వల్ల వస్తుంది. అదేవిధంగా, ఏదైనా పని చేసినప్పుడు, “ఇది నేను చేసినాను” అనే భావన అహంకారం వలన కలుగుతుంది.

ఒక సంఘటన నా మదిలో మెదులుతున్నది. ఆచార్యులు వారు ఒకసారి ఆంధ్రప్రదేశ్‌లో పర్యటిస్తున్నప్పుడు, వారు ఒక క్షేత్రాన్ని సందర్శించినారు. ఆ ప్రదేశం ఎంతో పుణ్య స్థలం అయినప్పటికీ, చాలా మంది యాత్రికులను అది ఆకర్షించుట లేదు, ఎందుకంటే ప్రయాణ సౌకర్యాలు సరిగా లేవు అక్కడ. ఒక అధికారి దీనిని సరిదిద్దే కార్యక్రమమును చేపట్టి, ఎన్నో ఏర్పాట్లు చేసినాడు. ఆ తర్వాత ప్రజలు పెద్ద సంఖ్యలో ఆ ప్రదేశాన్ని సందర్శించడం ప్రారంభించినారు. ఆచార్యులు వారు అక్కడికి వెళ్లినప్పుడు, ఆ అధికారి అక్కడి విషయాలను చూపిస్తూ, అది అంతా తన కృషి వలననే అని ప్రగల్భాలు పలికినాడు. ఆచార్యులు వారు మౌనంగా ఉండిపోయినారు. ఆలయ ప్రధాన ద్వారం వద్దకు వచ్చినప్పుడు, ఆచార్యుల వారు ఆగిపోయినారు. వారు ఆలయ గోపురాన్ని చూసి ఆ వ్యక్తిని అడిగినారు.

ఆచార్యులు: "మీరు ఈ గోపురాన్ని చూస్తున్నారా?".

అధికారి: అవును, చూస్తున్నాను.

ఆచార్య: దీని ఎత్తు ఎంత ?

అధికారి: చాలా ఎక్కువ.

ఆచార్యులు: దానితో పోలిస్తే మనం ఎక్కడ ఉన్నాము?

అధికారి: చాలా తక్కువ స్థాయిలో.

ఆచార్యులు: అలాంటి గోపురాలను ఎందుకు నిర్మించినారో మీకు తెలుసా? ఇది మన అహంకారాన్ని వదిలించుకోవడానికి, మనం ఎంతటి అజ్ఞానమైన హీన స్థితిలో ఉన్నామో తెలియబరిచేలా చేస్తుంది. ఈ అద్భుతమైన విశ్వ సృష్టికర్త అయిన విశ్వనాథుడిని గురించి ఆలోచించినప్పుడు, వారి అద్భుతమైన పనులతో పోలిస్తే, వారి ముందు మనం సాధించినది ఏమంత ముఖ్యమైనది కాదని తెలుసుకుంటాము. అందువల్ల, "నేను దీన్ని చేసాను" వంటి ఆలోచనలను కలిగి వుండటం చాలా అర్థరహితం.

జగద్గురు శంకరాచార్య పరమ పూజ్యశ్రీ మహాసన్నిధానం శ్రీ శ్రీ భారతీతీర్థ మహాస్వామి శ్రీ
జగద్గురు శంకరాచార్య మహా సంస్థానం, దక్షిణామ్నాయ శ్రీ శృంగేరి శారదాపీఠం, శృంగేరి.

తెలుగు అనువాదము - శ్రీ భాస్కరానంద నాథ    Source : VOJ_MARCH_2020

# నమామి భగవత్పాదం




**CHAPTER 3. From Brahmacharya to Sanyasa** అధ్యాయం–3/బ్రహ్మచారి నుండి సన్యాసి వరకు

శంకరుల చిన్నతనంలోనే వారి తండ్రి శివగురు కన్నుమూశారు. తల్లి ఆర్యాంబ అతనిని పెంచి పెద్ద చేసి సంప్రదాయం ప్రకారం అతనికి ఉపనయనం జరిపించినది. శంకరులు ఏకసంథాగ్రాహి, బాల్యంలోనే వేద విద్య మరియు సంస్కృత అధ్యయనాలను పూర్తి చేసుకొని, బాల శంకరులు ఒక అసాధారణమైన మహా వ్యక్తి అని నిరూపించుకున్నారు. బాల బ్రహ్మచారిగా వున్నప్పుడే దేవునిపై ప్రగాఢ విశ్వాసం ఉండేడిది, మరియు కొన్ని జరిగిన సంఘటనలు ద్వారా వారి దివ్య అవతారము బహిర్గతం చేయబడినది. అలాంటి ఒక సంఘటనలో, బ్రహ్మచారి నియమానుసారం శంకరులు, బాల బ్రహ్మచారిగా భిక్షాటన కోసం వెళ్ళినప్పుడు, పూర్తిగా పేదరికంలో ఉన్న ఒక మహిళ ఇంటికి వెళ్ళి "భవతి భిక్షాం దేహి" అని అడిగినాడు.. బాల బ్రహ్మచారిని చూసి, ఆమె గుండె ద్రవించి, "భిక్ష వేయడానికి నా దగ్గర ఏమియూ లేదు నాయనా" అని చాలా బాధతో, ఇంట్లో ఒక మూల పడివున్న ఎండిన ఉసిరిక కాయను తెచ్చి అతని భిక్షా పాత్రలో కన్నీళ్లతో వేసినది. ఆ మహిళ యొక్క దయనీయమైన దారిద్ర స్థితికి చలించిపోయిన బాల శంకరులు, శ్రీ లక్ష్మి దేవిని ప్రార్థిస్తూ లక్ష్మి దేవి పై ఆశువుగా శ్లోకాలను (కనకధారా స్తోత్రం) స్తోత్రం చేసినారు. లక్ష్మిదేవి తక్షణమే బంగారు ఉసిరికాయలను ఆ ఇంటినిండా కురిపించినది. ఇంకొకసారి శ్రీ శంకరుల తల్లి పూర్ణా నదిలో స్నానం చేసి తిరిగి వచ్చేటప్పుడు స్పృహ తప్పి పడిపోయినది. శ్రీ శంకరులు పూర్ణా నదిని ప్రార్థించి, తన తల్లికి ఇబ్బంది లేకుండా ఆమె తన మార్గాన్ని మార్చుకుని, వారి ఇంటి దగ్గరగా ప్రవహించమని నదీమ తల్లిని కోరినారు. బాల బ్రహ్మచారి యొక్క మనః పూర్వక విజ్ఞప్తికి నదీమ తల్లి కరుణించింది. మరుసటి రోజు ఉదయం, పూర్ణా నది నిజంగా తన మార్గాన్ని మార్చుకున్నదని తెలుసుకున్నప్పుడు కాలడి ప్రజలు విస్మయానికి గురయ్యారు.

సన్యాసం తీసుకునే సమయం ఆసన్నమవడంతో శంకరులు తన తల్లి అనుమతిని కోరాడు. కాని ఆర్యాంబ తన ఏకైక కుమారుడుని విడిచి ఒంటరిగా వుండటానికి ఆమె ఒప్పుకోలేదు. ఒక రోజు శ్రీ శంకరులు పూర్ణా నదిలో స్నానం చేస్తుండగా, ఒక మొసలి అతని కాలును పట్టుకుని లోపలికి లాగడం ప్రారంభించింది. పునర్జన్మ తీసుకోవడానికి ముందు సన్యాసం తీసుకోవడానికి తనకి అనుమతి ఇవ్వవలసినదిగా అతను తన తల్లికి విజ్ఞప్తి చేసినాడు. కనీసం తన కొడుకు కాషాయ వస్త్రాలలో ఉన్నప్పటికీ సజీవంగా వుంటాడని ఆర్యాంబకు అర్థమైంది. ఒకవేళ మొసలి తన కొడుకును విడిపించకపోతే, తన కొడుకు తన ఇష్టానుసారం సన్యాసిగా తన శరీరాన్ని విడిచిపెడతాడనే అనే తృప్తి తనకు ఇంకా ఓదార్పునిస్తుంది. ఆ ఆలోచనలతో, భయంతో వణుకుతున్న ఆర్యాంబ శ్రీ శంకరుల అభ్యర్థనకు అంగీకరించింది. అంతే మరుక్షణం మొసలి శంకరుల పై తన పట్టును విడుదల చేసింది. శంకరులు ఇప్పుడు సన్యాస దీక్ష తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నాడు మరియు తన తల్లిని తన బంధువుల సంరక్షణలో అప్పగించినాడు. శ్రీ శంకరుల నిర్ణయంపై అప్పటికీ దుఃఖిస్తున్న ఆర్యాంబ, శంకరుల యొక్క అభ్యర్థన మేరకు సన్యాస దీక్ష తీసుకోవడానికి మాత్రమే తన సమ్మతిని తెలిపినదని, కానీ తన అంత్యక్రియ కర్మలను వదులుకోవడానికి అనుమతించను అని అన్నారు. తన ఉత్తర క్రియలను యథావిధిగా శంకరులు నిర్వర్తించాలని కోరినది. కాబట్టి, తన తల్లిని శాంతింపచేయడానికి, శంకరులు ఈ క్రింది ప్రకటన చేశారు – శ్రీ శంకర మాధవీయ శంకర విజయంలో (5.71 వ వచనం) వివరించిన విధంగా... **అహన్యంబ రాత్రిసమయే సమయాంతరేవా సంచింతయ స్వవశగాఽవశగాఽథవామాం || ఏష్యామి తత్ర సమయం సకలం విహాయ విశ్వాసమాప్నుహి మృతావపి సంస్కరిష్యే ||**

'ఓ తల్లి! మీరు నన్ను తలచుకున్నప్పుడు, నేను నా పనులన్నింటినీ వదలి, మీ దగ్గరకు వెంటనే వస్తాను. మీరు నా గురించి పగలు, రాత్రి, సంధ్యా సమయంలో, ఏ సమయంలోనైనా సరే, మీరు స్పృహలో ఉన్నా, అపస్మారక స్థితిలో వున్నా లేదా భారంగా ఉన్నా, దుఃఖముతో వుండి స్మరించినా సరే నేను మీ దగ్గరకు వస్తాను. ఒకవేళ మీరు చనిపోతే, నేను మీ అంత్య క్రియలు చేస్తాను. మీరు నన్ను నమ్మవచ్చు అని శంకరులు వాళ్ళ తల్లికి ప్రమాణం చేసినారు...... (ఇంకా వుంది)

"Namami Bhagavatpadam' - Source: Sri Madhaviya Shankara Digvijayam by Sri Vidyaranya

# ||आत्मबोध:||

## ||ātmabodha:||

తెలుగు అనువాదము - శ్రీ భాస్కరానంద నాథ



तावत्सत्यं जगद्भाति शुक्तिकारजतं यथा ।

यावन्न ज्ञायते ब्रह्म सर्वाधिष्ठानमद्वयम् ॥ ७॥

తావత్సత్యం జగద్భాతి శుక్తికారజతం యథా .
యావన్న జ్ఞాయతే బ్రహ్మ సర్వాధిష్ఠానమద్వయం .. 7..

ఈ సృష్టికి మూలాధారమైన బ్రహ్మం తెలియబడనంత కాలం, జగత్తు సత్యముగానే తోచును. అది ఎలాగంటే దూరం నుంచి ముత్యపు చిప్ప ఎండలో వెండి బిళ్ళ లాగా కనిపించినట్లు. నిజానికి అక్కడ వెండి లేదు, అది ఒక భ్రాంతి.

Jagadguru Śankarācārya His Holiness Śrī Śrī Srī Chandrashekara Bhāratī Mahāswāmiji and Jagadguru Śankarācārya His Holiness Śrī Śrī Srī abhinava Vidya Tirtha Mahāswāmiji at Sringeri (file photo)

उपादानेऽखिलाधारे जगन्ति परमेश्वरे ।

सर्गस्थितिलयान्यान्ति बुद्बुदानीव वारिणि ॥ ८॥

ఉపాదానేఽఖిలాధారే జగంతి పరమేశ్వరే.
సర్గస్థితిలయాన్యాంతి బుదబుదానీవ వారిణి .. 8..

సమస్తమునకు ఆధారభూతమైన ఆ పరమాత్మలో, ఈ లోకములు అన్నీ నీటి యందు బుడగల వలె సృష్టి, స్థితి, లయములు పొందుచున్నవి.

सच्चिदात्मन्यनुस्यूते नित्ये विष्णौ प्रकल्पिताः ।


व्यक्तयो विविधास्सर्वा हाटके कटकादिवत् ॥ ९॥

సచ్చిదాత్మన్యనుస్యూతే నిత్యే విష్ణౌ ప్రకల్పితాః .
వ్యక్తయో వివిధాస్సర్వా హాటకే కటకాదివత్ .. 9..

బంగారము నందు అనేక రకముల ఆభరణములు ఎలా కల్పించబడినవో, అలా నిత్యము, సర్వ వ్యాపి , సచ్చిదానంద స్వరూపమైన విష్ణువు నందు కూడా ఈ మాయా ప్రపంచము కల్పించబడినది. అన్ని జీవులయందు, వస్తువుల యందు అంతర్ముఖముగా బంగారము వలె ఆ పరమాత్ముడు కలడు.

(Will continue....)

## Aparokṣānubhūtī अपरोक्षानुभूति




विषयेभ्यः परावृत्तिः परमोपरतिर्हि सा ।
सहनं सर्वदुःखानां तितिक्षा सा शुभा मता ।। ७ ।।

విషయేభ్యః పరావృత్తిః పరమోపరతిర్హి సా .
సహనం సర్వదుఃఖానాం తితిక్షా సా శుభా మతా ||7||

ఇంద్రియ వస్తువులన్నింటి యందు, విషయ వాసనలయందు పూర్తిగా విరక్తి కలిగి యుండటమే ఉపరతి, మరియు అన్ని దుఃఖములను, బాధలను సమ భావంతో భరించే శక్తిని తితిక్ష అంటారు, ఇది సంతోషానికి అనుకూలంగా ఉంటుంది.

निगमाचार्यवाक्येषु भक्तिः श्रद्धेति विश्रुता ।
चित्तैकाग्र्यं तु सल्लक्ष्ये समाधानमिति स्मृतम् ।।८।।

నిగమాచార్యవాక్యేషు భక్తిః శ్రద్ధేతి విశ్రుతా .
చిత్తైకాగ్ర్యం తు సల్లక్ష్యే సమాధానమితి స్మృతం ||8||

గురు, వేద వాక్యములయందు సంపూర్ణ విశ్వాసము, భక్తి కలిగియుండడాన్ని 'శ్రద్ధ' అని, బ్రహ్మమునందు చిత్తైకాగ్రత కలిగియుండడాన్ని 'సమాధానము' అని అందురు.

संसारबंधनिर्मुक्तिः कथं मे स्यात् कदा विधे ।
इति या सुदृढा बुद्धिर्वक्तव्या सा मुमुक्षुता ।। ९।।

సంసారబంధనిర్ముక్తిః కథం మే స్యాత్ కదా విధే |
ఇతి యా సుదృఢా బుద్ధిర్వక్తవ్యా సా ముముక్షుతా ||9||

ఈ సంసార బంధనాల నుండి విముక్తి ఎప్పుడు, ఎలా లభిస్తుంది ? అని ఎల్లప్పుడూ ప్రగాఢమైన వాంఛ కలిగియుండటమే 'ముముక్షుత్వం' అంటారు.

(Will Continue….)

## శృంగేరి లేఖలు (Letters of Sringeri)

**Source: “Glimpses of Grace”**

జగద్గురువులు శ్రీ శ్రీ భారతీతీర్థ మహాస్వామి వారి ఆశీస్సులతో ......

ఈ సంఘటన 2010 లో జరిగింది. ఒక మహిళా భక్తురాలు తన తల్లిదండ్రులతో కలిసి ఢిల్లీ లో నివసిస్తున్నారు. ఆమె తండ్రి తీవ్రమైన వెర్టిగో సమస్యతో బాధపడుతున్నాడు, వాస్తవానికి ఇది ఒక లక్షణం మాత్రమే, వ్యాధి కాదు. మూలకారణం గుర్తించబడే వరకు, అతని రోగ పరిస్థితికి పరిష్కారం లేదు. అనేక మంది వైద్యులను సంప్రదించినప్పటికీ, ప్రధాన సమస్య నిగూఢమైన మర్మంగా మిగిలిపోయింది. రోజులు గడిచేకొద్దీ, అతని పరిస్థితి మరింత దిగజారుతుండేది, విధిలేక అతన్ని ప్రతి ప్రక్క రోజు అత్యవసర వార్డులో చేర్పించవలసి వచ్చేది ఆ కుటుంబానికి. నొప్పుల తీవ్రత కారణంగా, తలలో కణతులు ఏమన్నా ఉన్నాయో లేదో తెలుసుకోవడానికి MRI తో సహా అన్ని పరీక్షలు చేసినారు. కానీ ఫలితాలు రోగానికి ప్రతికూలంగా వచ్చినాయి. కణతులు లేవని తెలిసింది.




ఆమె తండ్రి ఆరోగ్య పరిస్థితి గురించి విన్న వారి కుటుంబ సన్నిహితులు, శంకర విద్యా కేంద్రం (ఎస్.వి.కె) నుండి శారదాంబ ప్రసాదం తీసుకొని వచ్చారు. తదనంతరం వైద్యులలో ఒకరు, ఆమె తండ్రి ఎడమ చెవిలో వున్న సమస్యను కనుగొని దానికి శస్త్రచికిత్స చేయాలని సూచించినారు. ఇది ఒక ప్రధానమైన సమస్య అని మరియు దానిని నివారించలేమని ఆ డాక్టరు హెచ్చరించారు. వర్షాకాలంలో ఇన్ఫెక్షన్ ఎక్కువగా వుంటుంది అని, శస్త్రచికిత్సను ఒక నెల రోజుల పాటు వాయిదా వేసినారు. ఈలోగా, ఆ మహిళా భక్తురాలికి ఒక కల వచ్చింది, ఆ కలలో ఆచార్యుల వారు తమ తండ్రి ముందు చెక్క ఆసనం మీద కూర్చొని వున్నారు. వారి దగ్గర మామిడి పండ్లతో నిండిన ఓ బుట్ట వున్నది. ఆమె తండ్రి తన పరిస్థితిని ఆచార్యుల వారికి వివరించినారు. ఆచార్యుల వారు తన తండ్రి నాడి పరీక్ష చేయటానికి తన తండ్రి మణికట్టును పట్టుకుని, "అలా ఉందా? అలా అనిపించడం లేదే" అని అంటూ, ఆమె తండ్రికి ఒక మామిడి పండు ఇచ్చినారు. కల ముగిసింది.

ఆ కల తర్వాత నొప్పులు, పోట్లు అకస్మాత్తుగా ఆగిపోయాయి. తన SVK స్నేహితుల సహాయంతో, ఆమె రెండవ అభిప్రాయం కోసం మరొక వైద్యుడిని సంప్రదించింది, ఆ డాక్టరు కూడా మళ్ళీ శస్త్రచికిత్స అవసరమని సూచించినారు.

ఈ సమయంలో, తన స్నేహితుడి సోదరి ఒంటరిగా శృంగేరికి వెళుతున్నందున, ఆమెతో పాటు వెళ్ళి ఆచార్యుల దర్శనం చేసుకోవాలని నిర్ణయించుకుంది.

ఆచార్యుల యొక్క భవ్యమైన దర్శనం తరువాత, ఆచార్యుల వారికి వారి తండ్రి అనారోగ్యం గురించి మరియు శస్త్రచికిత్స గురించి స్నేహితుడి సోదరి చెప్పారు. ఆచార్యుల వారు వ్యాధి తీవ్రత గురించి ఆందోళనతో విని, శస్త్రచికిత్స అవసరం లేదని అన్నారు. ఆ సమయానికి ఉల్లాసంగా ఉన్నప్పటికీ, అది ఎలా సాధ్యమవుతుందో భక్తుడికి అర్థం కాలేదు. డిల్లీకి తిరిగి వచ్చిన తరువాత, వారు మళ్ళీ డాక్టర్ ను సంప్రదించినారు. ఆమె తండ్రి చెవిని పరిశీలించిన తరువాత, పరిస్థితి చాలా వరకు మెరుగుపడిందని మరియు శస్త్రచికిత్స అవసరం లేదని డాక్టర్ చెప్పారు. "గురు వాక్యం ఎప్పుడూ అబద్ధం కాదని మేము గ్రహించాము"...అని భక్తుడు అన్నాడు.

ఒక సంవత్సరం తరువాత, ఆమె తండ్రికి మళ్లీ తలపోటు వచ్చింది మరియు ఈసారి కూడా వైద్యుడు శస్త్రచికిత్స అవసరమని సూచించాడు, కాని రెండవ అభిప్రాయం మాత్రం అది అవసరం లేకపోవచ్చని వెల్లడించింది. అదే వారంలో ఆమె తండ్రి చెన్నైకి చెందిన శృంగేరి శిష్యుల బృందంతో కాలడిని సందర్శించారు మరియు వారు ఎప్పటిలాగే ఆనందంగా ఉన్నారు. "ఆచార్యుల యొక్క అపారమైన కారుణ్యం వల్లనే మా తండ్రికి పునర్జన్మ వచ్చింది...అని భక్తురాలు అన్నది. మా ఆచార్యుల వారు దయా సముద్రులు, మానవ రూపంలో వున్న శారదాంబ వారు.

శ్రీ గురో పాహిమాం...పరమ దయాళో పాహిమాం...శృంగేరి జగద్గురో పాహిమాం...శ్రీ భారతీతీర్థ పాహిమాం.. శ్రీ విధుశేఖర భారతీ పాహిమాం....దాసోహం శృంగగిరి నాథ. సర్వం శ్రీ గురు చరణారవిందార్పణమస్తు.


| Editorial Board | | |
|---|---|---|
| Sri P A Murali | Hon' Advisor | Administrator & CEO, Sri Sringeri Mutt & It's Properties, Sringeri |
| Sri S N Krishnamurthy | Hon' Editor | Sri Sringeri Mutt, Sringeri |
| Sri Tangirala Shiva Kumara Sharma | Hon' Editor | Sri Sringeri Mutt, Sringeri |
| B Srimathi Veeramani | Chief Editor | Tirunelveli |
| K M Kasiviswanathan | Hon' Editor | Tirunelveli |
| Sri Bhaskarananda Natha | Writer/Translator | Nellore |